డ్రెయినేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో వంతల పంచాయితీ పెదవలస గ్రామంలో డ్రెనేజీ కాలువల నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ జి.పద్మ, వైస్ సర్పంచ్ తిరుపతమ్మ సోమవారం ప్రారంభించారు, ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ, ఈ డ్రెనేజీ కాలువ లేక వర్షం నీరు ఇంటిముందే నిలువ ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కృష్ణమూర్తి, వార్డు సభ్యులు భీమన్న, చిన్న నూకరాజు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు హరి, కార్యదర్శి చిట్టి నాయకులు, తదితరులు పాల్గొన్నారు

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

హైడ్రో ప్రాజెక్టుపై నష్టాలను తెలుపుతున్న సురేంద్ర

కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న గంగరాజు, అప్పలనర్స

గిరిజనులను జల సమాధి చేసే...

హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లను రద్దుచేయాలి

కలెక్టర్ సమావేశంలో తేల్చి చెప్పిన సురేంద్ర, అప్పలనర్స, గంగరాజు, ఇతర నేతలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో సమావేశం మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, జెడ్పిటిసిలు, సర్పంచ్లు, ఆదివాసి గిరిజన సంఘం, వివిధ ప్రజా సంఘాల, గిరిజనులతో జిల్లా కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. గిరిజనులు, ప్రజాప్రతినిధులు హైడ్రో పవర్ ప్రాజెక్టులపై తమ సమస్యను వ్యక్తపరచాలని దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, గిరిజనులకు అడవి పంట పొలాలు ,కాఫీ తోటలే ప్రపంచమని ఈ భూములను హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో నవయుగ, అదానీ కంపెనీలకు ధారాదత్తం చేస్తామంటే గిరిజనులు చూస్తూ ఊరుకోరని తెలిపారు. గిరిజనులకు ఉపయోగపడే ప్రాజెక్టులు కడితే సహకరిస్తామని గిరిజనులకు నష్టం చేకూర్చే ప్రాజెక్టులు చేపడితే ఊరుకోమన్నారు.మజ్జివలస గ్రామంలో ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి సుమారు 15 ఎకరాలు భూమిని గిరిజనులు త్యాగం చేశారని, 2013 భూసేకరణ చట్టం ఉన్నప్పటికీ ప్రభుత్వం వారికి కనీసం పరిహారం అందించలేదని తెలిపారు.ఈ హైడ్రో ప్రాజెక్ట్ అనధికార ప్రాజెక్టు అని ఇలాంటి అనధికార వీటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అడవినీ నమ్మి బతుకే తమను ముంచుతామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. గిరిజనులు చిన్నచిన్న వాగులతోనే పంట పండించుకుని జీవనం సాగిస్తున్నారని హైడ్రో పవర్ కడితే గిరిజనులు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. గిరిజన ప్రాంత ఐదో షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టం,పేసా, గ్రామ సభ చట్టం అమలులో ఉండగా గిరిజన హక్కులు చట్టాలను తుంగలో తొక్కి ప్రైవేట్ వ్యక్తులైన నవయుగ, అదాని కంపెనీలకు గిరిజనుల భూములు ఎలా ధారాదత్తం చేస్తారని ప్రశ్నించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స. మాట్లాడుతూ, హైడ్రో ప్రాజెక్ట్ పేరుతో ఉద్యోగం ఇస్తామంటే నమ్మే పరిస్థితి ఎవరు లేదని అన్నారు. గతంలో నిర్మించిన సీలేరు మాచ్‌ఖండ్ ప్రాజెక్టులోనే ఉద్యోగం ఇస్తామని గిరిజనులను తీవ్రంగా మోసం చేశారని, ఇప్పుడు కొత్తగా ఉద్యోగాలు ఇస్తామంటే ఎవరు నమ్మరని అన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వలన ప్రైవేట్ కంపెనీలకు లాభం తప్ప గిరిజనులకు కాదని అన్నారు. గిరిజన ప్రాంతంలోనే కరెంట్ ఉత్పత్తి అవుతుందని, కానీ గిరిజన ప్రాంతంలో సింగిల్ లైన్ ద్వారా కరెంట్ ఇస్తున్నారని తెలిపారు. లోతేరు పంచాయతీలో కరెంట్ పోల్ లేక కర్రపాతి దాని ద్వారా కరెంటు ఉపయోగిస్తున్నారని అన్నారు.

అనంతగిరి జెడ్పిటిసి గంగరాజు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ మాట్లాడుతూ, గుజ్జెలి ప్రాజెక్ట్‌లో కట్టడం వలన అరకువెల్లి మండలం రెండు పంచాయతీలు, మన్యం పార్వతీపురం జిల్లా ఐదు పంచాయతీలు, అనంతగిరి మండలం మూడు పంచాయతీలు జలసమది అయ్యే పరిస్థితి ఉందన్నారు. పెద్దకోట 51 జీవో జారీచేసి 1800 మెగా వాట్ల కరెంటు ఉత్పత్తిని చేయుటకు అనుమతి ఇచ్చిందని, పెద్దకోట హైడ్రో ప్రాజెక్ట్ చేపడితే పెద్దకోట పినకోట, దేవరపల్లి, వివిధ మండలాలు జలసమాధి అయ్యే పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రాజెక్టు ఆదివాసులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆదివాసులకే మాత్రమే అడవి మీద సర్వహక్కు ఉంటుందని, ప్రైవేట్ వ్యక్తులకు భూములు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

హైడ్రో ప్రాజెక్ట్ పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో నవయుగ , అదాని కంపెనీ కి చెందిన వ్యక్తులు డ్రోన్ కెమెరాలతో రాత్రి పగలు సర్వేలు చేస్తుండడంతో గిరిజనులు భయభ్రాంతులకు గురి అవుతున్నారని అన్నారు.మజ్జివలస గ్రామంలో పోలీస్ బెటాలియన్ గ్రామంలో వచ్చి గంజాయి పేరుతో ఇంటింటికి వచ్చి సర్వే చేస్తున్నారని దీంతో గిరిజనులు ఇంకా భయాందోళనకు గురి అవుతున్నారన్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ బయట వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో వస్తే తమకు సమాచారం ఇవ్వాలని, ఇస్తే వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నవయుగ కంపెనీకి, అదానికి తాను ఏజెంట్ కాదని, గిరిజనుల అభివృద్ధి కోసం మాత్రమే పని చేస్తున్నానని, తాను ఒక్క రైతు రైతు బిడ్డ నేనని మీ బాధ నాకు అర్థమైందని చెప్పారు. 15 రోజులు లోపు మరో మీటింగ్ సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు హైడ్రో పవర్ పై పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఏఎస్పి పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ, సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్, జడ్పిటిసి శెట్టి రోషిని, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, సర్పంచులు చినబాబు రమేష్, మొత్తి, ఎంపిటిసిలు నొబో, హరి, సిపిఎం నేతలు పోతురాజు, త్రినాధ్, మగన, హరి, పోరాట కమిటీ నాయకులు స్వామి, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

గంజాయిని నిర్మూలిద్దాం

ఎస్‌పి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-అరకులోయ:గంజాయి జోలికి పోవద్దు - ఖైదీలుగా మారవద్దు అంటూ జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దర్ ఆధ్వర్యంలో సుమారు పది రాష్ట్రాలకు చెందిన 500 కు పైగా ఎన్ సి సి క్యాడెట్లు తో అరకులోయ మండల కేంద్రంలో పోలీస్ శాఖ భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్డులో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ నుంచి అరకులోయ టౌన్షిప్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ర్యాలీ లో గంజాయి జోలికి పోవద్దు , ఖైదీలుగా మారవద్దు, సే నో టు గంజా అంటూ ఎన్ సి సి క్యాడెట్లు ర్యాలీలో నినదించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, డ్రగ్స్‌కు అలవాటు పడవద్దని, గంజాయి పండించవద్దని, యువత బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని అన్నారు.గంజాయిపై ఇప్పటికే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, యువత బంగారు భవిష్యత్తుకు, ఉపాధికి అనేక మంచి మార్గాలు ఉన్నాయని ఎస్పీ అమిత్ బర్దర్ తెలిపారు. అరకు ప్రాంతం సహజ, సాంస్కృతిక గొప్పతనాన్ని అన్వేషించడానికి, ట్రెక్కింగ్ చేపట్టడానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అరకులోయ కు వచ్చిన ఎన్ సి సి క్యాడెట్లు కూడా స్థానికంగా ఉన్న గిరిజన యువతనే గైడ్ లుగా నియమించుకున్నారని ఈ సందర్భంగా ఎస్ పి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ట్రెక్కింగ్ ఎక్స్పెషన్ క్యాంప్ కమాండెంట్ నీరజ్ కుమార్, అరకులో ఎస్ సీఐ హిమగిరి, అరకులోయ, డుంబ్రిగూడ ఎస్సైలు గోపాలరావు, పాపి నాయుడు, పోలీసులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్ సి సి క్యాడెట్లు పాల్గొన్నారు .

ర్యాలీ చేపడుతున్న ఎస్‌పి, పోలీసు అధికారులు

కోమలబందలో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని కోమలబంద గ్రామంలో సర్పంచ్ సమిడి గోపాల్ చొరవతో తాగునీటి పథకానికి కొత్త మోటారు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. కోమలబంద గ్రామంలో తాగునీటి ట్యాంక్ ఉన్నప్పటికీ, మోటార్ దెబ్బతినడంతో నెలల తరబడి ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడ్డారు. దీంతో పంచాయతీ నిధులతో కొత్త మోటార్‌ను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామానికి తాగునీటి సరఫరా పునరుద్ధరించినట్లు సర్పంచ్ గోపాల్ వివరించారు. సర్పంచ్ గోపాల్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గెమ్మెలి రాజుబాబు, కొర్ర దావీదు, గెమ్మెలి కష్ణ, కొర్ర నాయుడు, వంతల శ్రీను, మహిళలు పాల్గొన్నారు.

ఏర్పాటు చేస్తున్న మోటార్

సీమకొండ రోడ్డు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని గుల్లెలి పంచాయితీ పరిధి సీమకొండ ప్రధాన రోడ్డుకు మరమ్మతులు చేయాలని సోమవారం చుట్టుపక్కల గ్రామాల వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి సంఘం నాయకులు మణుగూరు బాబూజీ, బూడిదే మాధవరావు మాట్లాడుతూ ప్రతి రోజూ తారాబు (పిట్టలబొర్రా) జలపాతనికి ఈ రహదారి మీదుగా వెళ్తు వస్తున్నారని, సుమారు 30 గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులు ఇదే మార్గంలో తెచ్చుకుంటున్నారని, రహదారి అధ్వానంగా ఉండడంతో వారంతా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబులెన్సు కూడా రాకపోకలకు అంతరాయంగా కలగడంతో రోగులను డోలిమోతాలతో ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరారు.

496 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జి.జి.హెచ్) ఆవరణలో "స్వస్థ - నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉచిత మెగా వైద్య శిభిరాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎ ఎస్. దినేష్ కుమార్ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహిం చారు. 18 ఏళ్ల నిండిన యువతులకు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర నాయుడు తెలిపారు. మెగా వైద్య శిభిరంలో మొత్తం 496 మంది రోగులు హాజరు కాగా వారిలో స్త్రీలు 305, పురుషులు 191 ఇతరత్రా వ్యాధులకు పరీక్షించి చికిత్సలు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుకు పార్లమెంట్ సభ్యులు గుమ్మా తనూజా రాణి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ, సహాయ కలెక్టర్ సాహిత్, రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక చైర్మన్ వి. గంగులయ్య, పాడేరు మార్కెట్ యార్డు చైర్మన్ డి. బుజ్జి బాబు, ప్రిన్సిపల్ - వైద్యకళాశాల డి.హేమలత,డిప్యూటి సుపరిండేంట్ టి. నరసింగరావు పాల్గొన్నారు.

పెరుగుతున్న వరదతో ఆందోళన

- భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 45.90 అడుగులు
- ఇంకా పెరిగే అవకాశం ఉందన్న అధికారులు

రాకపోకలు సాగించేందుకు ఉంచిన బోట్లు

నీట మునిగిన పొలాలు

ప్రజాశక్తి-విఆర్‌పురం: ఎగువన కురిసిన భారీ వర్షాలకు సోమవారం ఉదయానికి 44.10 ఉన్న గోదావరి నీటిమట్టం సాయంత్రానికి 45.90 అడుగులకు చేరుకుంది. దీంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందని సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు. నాలుగు రోజులుగా వరద పెరుగుతుండడంతో రహదారులపై వరద నీరు రావడంతో రాకపోకలు నిలిచిపోయాయని, పనులకు వెళ్లలేకపోతున్నామని వాపోయారు. పొలాల్లో నీరు చేరిపోడంతో మిర్చి నారు వేసే పరిస్థితి లేదని, మిర్చి నారు వేసిన దగ్గర్నుంచి నెలరోజుల వరకూ జాగ్రత్తగా కాపాడుకున్నామని నాటే సమయానికి వరద రావడంతో ఆందోళన చెందుతున్నారు. నారుమడికి రూ.50 వేలు ఖర్చు అవుతుందని తక్షణమే సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

హక్కుల సాధనకు మహిళలు ఐక్యంగా పోరాడాలి

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి

ప్రజాశక్తి- ఎటపాక: మహిళలంతా ఐక్యమై పోరాడితేనే మనల్ని మనం రక్షించుకోగలమని ఐద్వా రాష్ట్ర సహాయకార్యదర్శి సిహెచ్.రమణి అన్నారు. ఎటపాక మండలం ఐద్వా 4వ మహాసభ, అమరవీరులనగర్ ఎటపాకలో సోయం వీరమ్మ, పోడియం రత్తమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఐద్వా సీనియర్ నాయకులు సోయం వీరమ్మ సంఘం జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్రసహాయ కార్యదర్శి సిహెచ్.రమణి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకీ మహిళలకు రక్షణ లేకుండా పోతోందని మనల్ని మనం రక్షించుకోవాలంటే, అందరం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను కూడా పటిష్ఠంగా అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారన్నారు. ఐద్వా ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి ఐ.పద్మావతి మాట్లాడుతూ, అక్టోబర్ 5వ తేదీన చింతూరు మండలం ఎర్రంపేటలో జరిగే ఐద్వా జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభ నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంది. అధ్యక్ష, కార్యదర్శులుగా జి.కమల, పోడియం రత్తమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 15 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. 7గురితో ఆఫీస్ బేరర్స్‌ని ఎన్నుకున్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న సోయం వీరమ్మ

మట్టిపెళ్లలు తొలగిస్తున్న దృశ్యం

ఘాట్‌రోడ్‌లో జారిపడిన రాళ్లు, మట్టిపెళ్లలు

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలంలోని చింతాలమ్మ ఘాట్‌రోడ్డులో సోమవారం బండరాళ్లు, మట్టిపెళ్లలు జారిపడ్డాయి. రహదారికి అడ్డంగా రాళ్లు, మట్టిపెళ్లలు గుట్టలుగా పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఘాట్‌రోడ్డులో మలుపుల వద్ద తరచూ ఈ ఘటనలు జరుగుతున్నాయని సరైన రక్షణగోడలు ఏర్పాటు చేసి, సమస్య పరిష్కరించాలని, లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు.

జాబ్ మేళాలో 80 మంది ఎంపిక

ప్రజాశక్తి- రంపచోడవరం : హెచ్‌డిఎఫ్‌సి సారథ్యంలో అంబుజా ఫౌండేషన్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు సుమారు 200కి పైగా అధికసంఖ్యలో హాజరయ్యారు మారేడుమిల్లి, రంపచోడవరం, గంగవరం, వై.రామవరం, రాజఒమ్మంగి, అడ్డతీగల చుట్టు పక్కల గ్రామాల నుండి భారీసంఖ్యలో జాబ్‌మేళాకు నిరుద్యోగులు హాజరయ్యారు. 80 మంది ఎంపికైనట్టు యాజమాన్యం తెలిపారు కార్యక్రమంలో అంబుజా ఫౌండేషన్ రంపచోడవరం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ ప్లేస్మెంట్ ఆఫీసర్ తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న కిరణ్‌కుమార్

స్థూప నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని పూనెం సత్యనారాయణ వర్ధంతి అక్టోబర్ 23న జరగనున్న కారణంగా సోమవారం రేఖపల్లి ప్రధాన సెంటర్‌లో స్థూపం నిర్మాణం కోసం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. పూనెం కిరణ్‌కుమార్, ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్ పనులను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సున్నంరాజులు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల నాయకులు పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామమూర్తి, గుండిపూడి లక్ష్మణరావు, కమ్మచిచ్చు సత్యనారాయణ, శీరపు తాతబాబు, సోడి మల్లయ్య, కుంజా కన్నయ్య, సారా పాండురాజు, పులిసీతమ్మ, ఖాదర్‌బాబు, చిక్కాల పద్మారావు పాల్గొన్నారు.

వృత్తివిద్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- విఆర్‌పురం: వృత్తివిద్య శిక్షణ కోర్సులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం అజయ్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక వి.ఆర్ పురం హైస్కూల్‌లో శిక్షణ తీరును ఆయన పరిశీలిం చారు. ఆయనతో పాటు వత్తి విద్య అధ్యాపకులు వెంకటకృష్ణ (ఎలక్ట్రానిక్స్) నవీన్‌కుమార్ (ఆటోమోటివ్) పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలని సూచించారు.

ఆదివాసీల హక్కుల సాధనకు చట్టాలు అవసరం

ఆదివాసీ అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- రంపచోడవరం : ఆదివాసీల హక్కుల సాధనకు మరిన్ని చట్టాలు అవసరమని ఆదివాసీ నాయకులు అన్నారు. స్థానిక యుటిఎఫ్ భవనంలో శతశాతం ఉద్యోగాలు, హక్కులు అమలుకు ఆదివాసీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఆదివాసీ చట్టాన్ని సాధించాలని ఆమోదించారు. అనంతరం ఆదివాసీ హక్కుల ఉద్యోగుల సాధన కమిటీని ఎన్నుకున్నారు.

కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గీతపల్లి సిరిమల్లెరెడ్డి, అధ్యక్షుడిగా మడి మురళీధర్, ఉపాధ్యక్షుడిగా మడకం బంగారుబాబు, ట్రెజరర్‌గా చవళం శశిప్రీతం , తీగలపద్మను నియమించారు. సభ్యులుగా బి.రత్నాకర్, వరలక్ష్మి శ్రీనివాస్, కె.రమాదేవి, జి.విజయమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఆదివాసీ నాయకులు కంగల శ్రీనివాస్, తెల్లంశేఖర్, సాధన సాగర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

శతశాతం ఉద్యోగాలు గిరిజన యువతకు ఇవ్వాలి

ప్రజాశక్తి- రంపచోడవరం :

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం జిఒ 3కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి గిరిజన ప్రాంతాల్లో శత శాతం ఉద్యోగాలు ఆదివాసీ యువతకే ఇవ్వాలని రాజవొమ్మంగి ఎంపిపి గోము వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం రంపచోడవరం యూటిఎఫ్ భవనంలో ఆదివాసీ అఖిలపక్ష ఐక్య సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019లో జిఒ నెంబర్ 3ని రద్దు చేయగా అప్పటి రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి పుష్ప శ్రీవాణి జిఒ 3 రద్దును సవాల్ చేస్తూ అప్పీలు చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో గిరిజన ప్రాంతాల్లో సచివాలయం సిబ్బంది నియామకం శతశాతం గిరిజనులతోనే భర్తీ చేశారని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. జిఒ నంబర్ 3 కి ప్రత్యామ్నాయ జిఒ తెచ్చి శతశాతం పోస్టులు గిరిజన యువతకు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా అన్నిఖాళీలు గిరిజన అభ్యర్థులతో నింపాలని, వీటిని చర్చించేందుకు తక్షణమే ఐటిడిఎ పాలకమండలి సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ జాక్ నాయకులు, వంతు బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆదివాసీ యువత, మహిళలు, రాజవొమ్మంగి ఎంపిపి గోము వెంకటలక్ష్మి, బరదనంపల్లి ఎంపిటిసి సుంద్రు లోవలక్ష్మి, రాజవొమ్మంగి ఎంపిటిసి కనిగిరి గంగదుర్గ వీరబాబు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజవొమ్మంగి ఎంపిపి వెంకటలక్ష్మి

కోతుల బెడదతో బెంబేలు

డమ్ముకులో ఇళ్లపై సంచరిస్తున్న కోతుల గుంపులు

ప్రజాశక్తి అనంతగిరి:అల్లూరి జిల్లా గిరిజన అటవీ ప్రాంతంలో ఎక్కడ చూసినా కోతుల బెడద ఎక్కువగా ఉంది. సహజంగా గిరిజనులు పండించే వ్యవసాయ పంటలపై ఆధారపడి కోతులు జీవనం సాగిస్తున్నాయి.

మండలంలోని అరకు మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న డమ్ముకు గ్రామంలో ఇల్లు, కిరాణా షాపుల పై కోతులు సంచరిస్తున్నాయి. కిటికీ, తలుపుల నుండి లోపలికి ప్రవేశించి తినే ఆహార పదార్థాలు, తినుబండారాలను ఎత్తుకెళ్లి పోతున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా సంచరిస్తున్నాయి. శివలింగపురం, బొడ్డ రోడ్డు మీదుగా డమ్ముకు, ములియగుడ, అనంతగిరి మీదుగా బీసుపురం, సుంకరమెట్ట రోడ్డుకు ఇరువైపులా కోతుల బెడద ప్రతిరోజు ఉంటుంది. ప్రముఖ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది పర్యాటకులు తినుబండారాలు పడవేస్తుండటంతో రోడ్డుపైనే గుంపు గుంపులుగా గుమ్మికూడి ఉంటాయి. బైక్‌లలో ప్రయాణించే పలువురు ప్రయాణికులను వెంబడిస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నాయి.

వైసిపి డిజిటల్ బుక్ ఆవిష్కరణ

డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-చింతపల్లి : మండల కేంద్రంలో వైసీపీ రూపొందించిన క్యూఆర్ కోడ్ కరపత్రాలను వైసిపి మండల అధ్యక్షుడు పాంగి గణబాబు, నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు పదిహేను నెలలు గడుస్తున్నా ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక సూపర్ అబద్ధాలతో మోసం చేస్తోందన్నారు.క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల వద్దకు చేరి నిజం చెబుతామని చెప్పారు.

కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత, ఎంపిటిసి సభ్యులు తాంబెలి మోహన్‌రావు, సర్పంచ్ సమిడిగోపాల్, వైసిపి మండల సమపలేటి జోసెఫ్, సాగిన శ్రీరాములు, పోటుకూరి బెన్నిబాబు, కృష్ణారావు పాల్గొన్నారు.

విఆర్‌పురం: వైసిపి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంతబాబు రంపచోడవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశానుసారం మండల పార్టీ అధ్యక్షుడు మాడిరెడ్డి సత్తిబాబు ఆధ్వర్యంలో క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో అన్యాయం చేసిన అధికార పార్టీ నాయకులు, అధికారుల పేర్లను క్యూఆర్ కోడ్‌లో ఎంటర్ చేసి జరిగిన నష్టాన్ని, అన్యాయాన్ని క్యూఆర్ కోడ్‌లో ఎంటర్ చేస్తే అది రాష్ట్రపార్టీ లాగిన్‌కి పంపబడుతుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కార్యకర్తకు జరిగిన నష్టాన్ని ఇబ్బందిని పార్టీ సరి చేస్తుందని ఇందుకు కేసులు పెట్టిన అధికారులపై చర్యలు తీసుకుంటామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల గంగయ్య, ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, మండల నాయకులు పాల్గొన్నారు.

ధారకొండలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-సీలేరు: జికెవీధిమండలం ధారకొండలో దుర్గాదేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి సన్నిధిలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం దుర్గాదేవి విగ్రహాన్ని ధారకొండ పురవీధుల్లో ఊరేగించి సీలేరు నదిలో నిమజ్జనం చేయడానికి నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం మూలా నక్షత్రం కావడంతో సరస్వతీ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జీకే వీధి మండలం సీలేరులో దుర్గాదేవి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం మండపం వద్ద సరస్వతి దేవి పూజలు ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు పూజల్లో పాల్గొన్నారు.

విఆర్‌పురం: మండల కేంద్రంలోని రాజుపేట కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జొన్నాడ నాగేశ్వరరావు, పోచమ్మ దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ , గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పిఒ శుభంనొక్వాల్ తదితరులు

ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి-కూనవరం: ఎఎస్‌డిఎస్ ఆధర్వ్యంలో సోమవారం చింతూరు ఐటిడిఎ పిఒ శుభంనొక్వాల్, ఎఎస్ పంకజ్‌కుమార్‌మీనా శబరికొత్తగూడెం గ్రామంలో 302 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఆపద సమయంలో ముందుండే ఎఎస్‌డిఎస్ డైరెక్టర్ గాంధీబాబును అభినందించారు. ప్రభుత్వం నుండి రావాల్సిన సదుపాయాలను నిర్వాసితులకు అందేలా చూస్తామని వరదలపై ఎవ్వరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. ఎప్పటికప్పుడు వరద పై ముందస్తు సమాచారం అందిస్తున్నామని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారు. శబరికొత్తగూడెం గ్రామంలో వరద ప్రవాహం పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి కోసం తగిన చర్యలు తీసుకున్నామని సర్వే కోసం ప్రత్యేకంగా బృందాలను నియమించామని గ్రామాల్లో మిగిలిన అర్హత కలిగిన వారికి ప్యాకేజ్ అందుతుందని వెల్లడించారు. ఎంపిపి రంగమ్మ, సర్పంచ్ లక్ష్మి, తహశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ జగన్నాథరావు, టిడిపి నాయకులు యడవల్లి భాస్కర్‌రావు, చెలికాని ఉమా, పారి సోమయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పునఃప్రారంభించండి

ఇంజినీరింగ్, విద్యాశాఖల అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-అరకులోయ : ఫేజ్ - 2లో మంజూరై ఆగిన ఇంజినీరింగ్ పనులు తిరిగి ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో పిఎం హామీ పనులు పై రవ్వలగూడ ఆశ్రమ పాఠశాలలో ఏటిడబ్ల్యు, గిరిజన ఇంజనీరింగ్, పంచాయతీ రాజ్, విద్యాశాఖలతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఫేజ్ 2లో పనులు ఏయే ఇంజనీరింగ్ శాఖలు మంజూరయ్యాయని ఆరా తీశారు. ఫేస్ 1లో మంజూరైన పనులన్నీ సకాలంలో పూర్తయినందున జిల్లాలో ప్రజలందరూ సంతృప్తి చెందారన్నారు. ఫేస్ 2 లో ఆగిపోయిన పనులు ఏ టిడబ్ల్యు ఇంజనీరింగ్ అసిస్టెంట్ కలిసి తిరిగి సందర్శించి వాటి స్థితిగతులపై నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. లేటెస్ట్ ఫోటోస్ తీసుకుని యాప్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఫేస్ 2కి ఇన్పుట్ డేటా షీట్ తయారు చేయాలని సూచించారు. ఇంకా మొదలుకాని పనులకు ప్రతిపాదనలు అక్టోబర్ 10లోగా పంపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మండల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన టాయిలెట్స్ జాబితాను ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు కలిసి తనిఖీ చేసి తయారు చేయాలని ఆదేశించారు. జాబితాను పక్షంరోజుల్లో తయారు చేయాలని ఆదేశించారు.బేస్ లైన్ ట్రైనింగ్ కార్యక్రమానికి (ఎఫ్ ఎల్ ఎన్) టీచర్స్, ఎంఈఓలు, హెచ్ఎంలు తప్పకుండా హాజరు అవ్వాలని ఆదేశించారు. మాస్టర్ ట్రైన్స్ బేస్ లైన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ పూర్తయిందని తెలిపారు. ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా ఈ ట్రైనింగ్ కార్యక్రమం చెయ్యాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రాబోయే కాలంలో కూడా పరీక్షలలో ఎటువంటి అవకతవకలకు చోటు లేకుండా పకడ్బందీగా చేస్తామని తెలిపారు. ఐటీడీఏ వారీగా పిఎంఆర్సి లో అకాడమిక్ మానిటరింగ్ సెల్ ప్రారంభిస్తామన్నారు. ఎఫ్ ఎల్ ఎన్ నుంచి సిబ్బందిని డిప్యూట్ చేసి అకాడమిక్ పెర్ఫార్మెన్స్, లర్నింగ్ అవుట్ కమ్స్, ఎఫ్ ఎల్ ఎన్ ట్రైనింగ్ కార్యక్రమం పై పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ, రంపచోడవరం,చింతూరు పీఓ బి. స్మరణ రాజ్, శుభం నొక్వాల్, సమగ్ర శిక్షణ అధికారి స్వామి నాయుడు, డీఈఓ పి.బ్రహ్మాజీ, ఈఈలు, ఏఈలు, ఎంఈఓ లు, ఏటిడబ్ల్యూఓ లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపులపై అవగాహన

పాడేరు, విఆర్ పురంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాడేరు:జిఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు అరకు లోయలో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో జీఎస్టీపై ఉప సహాయ కమీషనర్ అజీజ్ ప్రజలకు వివరించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీ బాయ్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు భారీ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం డిప్యూటీ కమీషనర్ పద్మజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సహాయ కమీషనర్ పద్మ విభూషణ్, ఐసిడిఎస్ సిడిపిఒ పాల్గొన్నారు. పాడేరులో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

అనంతగిరి: జిఎస్టి భారం తగ్గింపుపై మండలంలోని కాశీపట్నం, అనంతగిరి పంచాయతీ లో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి .శ్రావణ్ కుమార్ అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బుజ్జి. బాబు, ప్రధాన కార్యదర్శి ఆనందరావు, క్లస్టర్ ఇంచార్జి జోగులు ు పాల్గొన్నారు.

విఆర్‌పురం : ఎంపిడిఒ ఇమ్మానుయేలు అధికారులు, జనసేన నాయకులతో మండలంలో విఆర్ పురం, రేఖపల్లి ప్రధాన రహదారిలో దుకాణాల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. విఆర్ పురం సంతలో ప్రజల వద్దకు వెళ్లి జిఎస్టి సవరణ వల్ల పొందే లబ్ధిని వివరించారు. జనసేన మండల కార్యదర్శి మొలకల.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: స్థానిక మండల కేంద్రంలో గల వ్యాపారస్తులకు జిఎస్‌టిపై వివిఎన్ కుమార్ అవగాహన కల్పించారు. జిఎస్‌టి అధికారి మూర్తి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అనంతరం అడ్డతీగల మండల కేంద్రంలో వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు విద్యార్థులకు మేలు జరుగుతుందని జిఎస్‌టి అధికారి భాస్కరరావు అన్నారు. సోమవారం మండలంలో ఆయన పర్యటించారు. ఎంపిడిఒ బాలమురళీకృష్ణ, రాజేంద్రపాలెం సర్పంచ్ సింహాచలం, కార్యదర్శి మోనిక తదితరులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులకు అవగాహన కల్పించారు.

పలు సమస్యలపై పిఒకు వినతి

పిఒకు వినతిపత్రం ఇస్తున్న జెడ్‌పిటిసి రంగారెడ్డి తదితరులు

ప్రజాశక్తి -విఆర్‌పురం: చింతూరు ఐటిడిఎ పిఒ శుభం నొక్వాల్‌ను జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, టిడిపి ప్రధాన కార్యదర్శి బుర్కా కన్నారావు, వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరకా సూర్యప్రకాశరావు కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. జెడ్‌పిటిసి మాట్లాడుతూ విఆర్‌పురం మండలంలో గోదావరి వరదల వల్ల వరి నాట్లు నీట మునిగి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలన్నారు. విఆర్ పురం మండలంలో 41.15 కాంటూరు సంబంధించిన నిర్వాసితులకు ఇచ్చిన పునరావాస కాలనీలు నిర్మాణం పూర్తి చేయాలని మౌలిక సదుపాయాలు కల్పించాలని, వరద బాధితులకు ఇవ్వాల్సిన 25 కిలోల బియ్యం, నగదు ఇంతవరకూ ఇవ్వలేదని తక్షణమే ఇప్పించాలని కోరారు. నిర్వాసితులకు ఇచ్చిన భూముల్లో రాళ్లు, రప్పలు ఉన్నాయన్నారు. స్పందించిన పిఒ దానికి సంబంధించిన వివరాలు ఇవ్వాలని తెలిపారు. అన్నవరం బ్రిడ్జి కూలి పోవడంతో ఇబ్బందిగా ఉందని చింతూరు నుండి చింతరేగుపల్లి మీదుగా పెద్దమటపల్లి నుండి ఉమ్మడివరంలో రాత్రి బస చేసి తెల్లవారుజామున నాలుగు గంటలకు తిరిగి వెళ్లే విధంగా బస్సు సౌకర్యం కల్పించాలని పిఒను కోరారు. పిఒ సానుకూలంగా స్పందించారు.

అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణం చేపట్టాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ జెఎసి నాయకులు

ప్రజాశక్తి -సీలేరు: అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణం చేపట్టాలని భారత ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మేట్టడం రాజాబాబు, జెఎసి చైర్మన్ రామారావుదొర సోమవారం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు విన్నవించారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని ఆయనను కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎపి నుంచి తెలంగాణ, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జికె వీధి మండలం ఆర్‌వినగర్ నుంచి వై.రామవరం మండలం పాలగెడ్డ వరకు రహదారి సౌకర్యం లేక పలువురు ఇబ్బంది పడుతున్నారన్నారు. సీలేరు డొంకరాయి మోతుగూడెంనకు చెందిన విద్యుత్ ఉద్యోగులు వ్యాపారులు జికె వీధి నుంచి పాలగెడ్డ వరకూ సుమారు 100 గ్రామాలు ప్రజలు రహదారిపై ఆధారపడి ఉన్నారని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. విశాఖ వయా భద్రాచలం మీదుగా బస్సులు నడుస్తున్నాయని రహదారి సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఆదివాసీ జెఎసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

అవుట్‌సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- రంపచోడవరం : ఐటిడిఎ పరిధిలోని గిరిజన హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సోమవారం సిఐటియు కార్యాలయం నుండి ఐటిడిఎ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ నినాదాలు చేయడంతో పిఒ స్మరణ్‌రాజ్ స్పందించి సమస్యలు అడిగి తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పిఒకి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు మాట్లాడుతూ 2022లో ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలకు సంబంధించిన జిఒ7ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని దానిలో ఉన్న వేతనాలను వారికి అమలు చేస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శాంతిరాజు, పోడియం లక్ష్మణ్ మాట్లాడారు. కార్యక్రమంలో పి.లక్ష్మణ్, గిరిజన సంఘ నాయకులు కొమరం సుబ్బారావుదొర, హాస్టల్‌వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 82 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం: స్థానిక ఐటిడిఎ సమావేశపు భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమం పిఒ స్మరణ్‌రాజ్, ఎపిఒ జనరల్ డిఎన్వి రమణ, సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిని యం. సావిత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ ఈ వారం సుమారు 82 అర్జీలు రావడం జరిగిందని వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హతలను బట్టి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సూపర్ బజార్‌లో తగ్గింపు ధరలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విజయదశమి సందర్భంగా సూపర్ బజార్ దసరా ధమాకాగా తగ్గింపు ధరలకు సరుకులు విక్రయిస్తున్నట్లు సూపర్ బజార్ మేనేజింగ్ డైరెక్టర్ పి.శ్రీరామమూర్తి తెలిపారు. సూపర్ బజార్ కౌంటర్, రైతుబజార్లలోని అన్ని కౌంటర్లలో ఎంఆర్‌పిపై 30 శాతం తగ్గింపుధారులకు సరుకులు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

డ్రైనేజీలో పూడిక తీతలు

ప్రజాశక్తి -అడ్డతీగల: మండల కేంద్రంలో డ్రైనేజీల్లో సోమవారం పూడికతీతలు చేపట్టారు. సర్పంచ్ పప్పుల చిట్టెమ్మ, వైస్ సర్పంచ్ ముప్పన శెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో పనులు చేయించారు. తడి చెత్త పొడి చెత్తను విడివిడిగా పారిశుధ్య సిబ్బందికి అప్పగించి సహకరించాలని గ్రామస్తులకు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన
కసాయి తండ్రికి యావజ్జీవ ఖైదు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : ఐదేళ్ల కన్నకూతురిపై అతి కిరాతకంగా లైంగికదాడికి పాల్పడిన కసాయి తండ్రికి విశాఖ ఫోక్సో న్యాయస్థానం చనిపోయేవరకు కఠినజైలు జీవితాన్ని అనుభవించాలని తీర్పుచెప్పింది. దీంతోపాటు నిందితుడు రూ.10వేలు జరిమానా చెల్లించాలని, లేకుంటే అదనంగా మరో మూడునెలలు సాదారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. జరిమానా సొమ్ములో రూ.ఐదు వేలు బాధిత బాలికకు చెల్లించాలని, మిగతా మొత్తం ప్రభుత్వానికి చెందాలని తీర్పులో స్పష్టం చేశారు.

బాధిత బాలిక తరుపు కేసు వాదించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలివి. విశాఖలోని షిప్పింగ్ హార్బర్ ప్రాంతంలో నివాసముంటున్న నిందితుడు పి అప్పన్నకు ఇద్దరు పిల్లలు. ఒక కూతురు,కుమారుడు. కూతురికి ఐదేళ్ల వయసు. గత ఏప్రిల్ 15న రాత్రి 11 గంటల సమయంలో మద్యం మత్తులో భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని తగరపువలస మార్కెట్ యార్డు వద్ద ఇద్దరు పిల్లల్ని దారుణంగా హింసించిన అప్పన్న, అంతటితో ఆగకుండా ఐదేళ్ల బాలికపై సొంత కూతురు అన్న మమకారం కూడా లేకుండా అతి కిరాతకంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావమైన బాలికను కర్ణాటక చెందిన ఇద్దరు లారీ డ్రైవర్లు చూపి, సమీపంలోని బంగారం షాపులో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్‌కు విషయం చెప్పగా, అతను స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నైట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ రవి వచ్చి బాలికను వైద్యశాలలో చేర్పించారు. అప్పట్లో పరారైన నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతనిపై 10 సెక్షన్ల కింద భీమిలి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. అదనపు పోలీస్ కమిషనర్లు సిహెచ్ పెంటారావు, ఎస్ అప్పలరాజు కేసు దర్యాప్ చేసి, నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. మహిళా కానిస్టేబుల్ పైడితల్లి ప్రాసెక్యూషనుకు సహకరించారు. విచారించిన న్యాయమూర్తి, నేరం రుజువు కావడంతో నిందితుడు చనిపోయే వరకు కఠిన కారాగార శిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించారు.

గ్యాస్ సిలిండర్ పేలి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 94వ వార్డు అప్పల నరసయ్య కాలనీలో సోమవారం మధ్యాహ్నం వంటగ్యాస్ సిలెండర్ పేలి వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలివి. అప్పలనరసయ్య కాలనీలో పి ఈశ్వరరావు అనే వ్యక్తి ఇంట్లో వంట చేస్తుండగా సిలిండర్ పైపు నుంచి గ్యాస్ లీకవ్వడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి సిలెండర్ పేలిపోయింది దీంతో ఈశ్వరరావుకు కాలు, చేతిపై తీవ్ర కాలిన గాయాలయ్యాయి. వెంటనే గోపాలపట్నం ఆసుపత్రిలో చేర్పించారు.

ప్రమాదం జరిగిన ఈశ్వరరావు ఇంట్లో కార్యక్రమం ఉండడంతో బంధువులు కూడా వచ్చారు. అయితే ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు 94వ జనసేన అధ్యక్షురాలు పిన్నింటి పార్వతి, నాయకులు తనకాల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు సంఘటనాస్థలాన్ని సందర్శించి, బాధితులను పరామర్శించారు.

పిల్లల హృద్రోగాలకు కిమ్స్ కడల్స్‌లో ప్రత్యేక చికిత్స

ప్రజాశక్తి- గాజువాక : గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న చిన్నపిల్లలకు కిమ్స్ కడల్స్ ఆసుపత్రిలో అధునాతన, ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని ఆసుపత్రి పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శాంతిప్రియ అన్నారు సోమవారం ప్రపంచ హృద్రోగ దినోత్సవం సందర్భంగా షీలానగర్ కిమ్స్ఐకాన్ ఆసుపత్రిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ, ఒకపుడు పెద్ద వయస్సు వారికే వచ్చే గుండెజబ్బులు, ఇపుడు పుట్టుకతోనే పిల్లలకు, తర్వాత చిరుప్రాయంలోనూ వస్తున్నాయన్నారు. అటువంటి వారెందరో కిమ్స్ కడల్స్‌లో చికిత్సతో పునర్జన్మ పొందారన్నారు. డాక్టర్ సతీష్‌కుమార్ పెతకంశెట్టి, డాక్టర్ సాయి బలరాంకృష్ణ మాట్లాడుతూ, వెంటిలేటర్, ఎక్మో, హార్ట్ లంగ్ మిషన్‌లాంటి వాటి మీద ఉండి, ఆపరేషన్ తర్వాత కోలుకుని పూర్తి ఆరోగ్యంతో ఉన్న పీడియాట్రిక్ కార్డియాక్ వారియర్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్‌కుమార్ రౌతు, డాక్టర్ నిఖిల్ తెన్నేటి, డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ అనిల్ కుమార్ దాసరి, డాక్టర్ నాగరాజన్ పీడియాట్రిక్ కార్డియాక్ అనస్థీషియాలజిస్ట్ పాల్గొన్నారు

ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

భవననిర్మాణ కార్మికుల జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - అడ్డతీగల: జిల్లాలో మొట్టమొదటిసారిగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిఐటియు, అన్ని కార్మిక సంఘాల వారు రంపచోడవరం మండల కేంద్రంగా అక్టోబర్ 1వ తేదీన జిల్లా మహాసభ నిర్వహిస్తున్నారని దానిని జయప్రదం చేయాలని అడ్డతీగల భవననిర్మాణ సంక్షేమ సంఘం కార్యదర్శి గుల్లాల సురేష్ బాబు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవననిర్మాణ కార్మికుల సమస్యలపై నాయకులు మాట్లాడుతారని అడ్డతీగల వినాయక తాపీపని సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి గ్రామం, ప్రతి మండలానికి వెళ్లి ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అంతా హాజరుకావాలని కోరారు. ఉపాధ్యక్షుడు చాగంటి ఆదినారాయణ పాల్గొన్నారు.

జాపరా మొక్కలను సద్వినియోగం చేసుకోవాలి

మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి -సీలేరు: ప్రభుత్వం అందజేసిన జాపరా మొక్కలను గిరి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పాంగి దుర్గో సూచించారు. జికె వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో 3800 జాపర మొక్కలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా ఒక్కొక్క రికి 200 మొక్కలు చొప్పున 19 మంది రైతులకు అందజేశామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ పథ్వీరాజు, రైతులు పాల్గొన్నారు.

డొంకరాయి జలాశయం నీరు నిలుపుదల

నీటి విడుదలను నిలిపివేసిన దశ్యం

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయం గేట్ల ద్వారా దిగువ ప్రాంతానికి నీటి విడుదలను సోమవారం సాయంత్రం నుంచి నిలిపివేసి నట్లు ఎపి జెన్కో అధికారులు తెలిపారు. జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుము ఖం పట్టడంతో సోమవారం సాయంత్రానికి 1034.40 అడుగులు వద్ద జలాశయంలో నీటిమట్టాలు స్థిరంగా ఉన్నాయన్నారు. దీంతో 6, 7 గేట్లు ద్వారా నీటి విడుదలను నిలిపివేసినట్లు ఎపి జెన్కో అధికారులు తెలిపారు.

రేగులపాడులో పలువురికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కూనవరం: రేగులపాడులో స్వస్థనారీ కార్యక్రమంలో భాగంగా కూటూరు పిహెచ్‌సి డాక్టర్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ బొగ్గ రామారావు ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు కిషోర్ ముఖ్య అతిథిగా హాజరై సేవలందించారు. 140 మంది గర్భిణులు, బాలింతలు, మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. పోషకాహారం లోపం, క్యాన్సర్, టిబి గురించి అవగాహన కల్పించారు. అనంతరం మందులు అందించారు. పలువురు వైద్యసిబ్బంది, అంగన్‌వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.